విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 10, జూలై 2024

నేడు నంద్యాల మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-నంద్యాల రూరల్: నేడు నంద్యాల మండల సర్వసభ్య సమావేశము స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఎంపీడీవో సౌభాగ్యం తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సమావేశం నేడు ఉదయం 10 గంటలకు జరుగుతుందన్నారు. అందువల్ల ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అన్ని రంగాలకు చెందిన అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కోఆప్షన్ మెంబర్లు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సమావేశం నందు గత కార్యక్రమాల సమీక్ష, భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై తాగునీరు, పారిశుద్ధ్యం పై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా మండల సర్వ సభ్య సమావేశమునకు మంత్రులు ఎన్ ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొంటారని ఆమె తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏవో శంషా, ఏపీవో శ్రీకళారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు మండలం మోత్కూరు గ్రామానికి చెందిన పుల్లారెడ్డి గారి శేఖరరెడ్డి (55) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మరణించారు. వెలుగోడు నుంచి సంత చేసుకొని టీవీస్ టూ వీలర్‌పై మోత్కూర్‌కు వెళుతుండగా వేల్పనూరు వెళుతున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి కట్టెలడిపో వద్ద రోడ్డు ప్రమాదంలో శేఖర రెడ్డి తీవ్రంగా గాయ పడ్డారు. వెలుగోడు ఆసుపత్రికి వెళ్లేసరికి మరణించిన్నట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ రాజారెడ్డికి అభినందన వెల్లువ

విశాలాంధ్ర - బనగానపల్లె: ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామ లక్ష్మి, అధ్యాపక బృందం మాజీ సర్పంచ్ బిసి రాజా రెడ్డిని కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మంగళవారం బీసీ గుర్రెడ్డి కాలనీలోని బీసీ రాజారెడ్డి స్వగృహంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శేఖర్, మద్దయ్య, ఆంజనేయులు, మహేష్ పాల్గొన్నారు.

గౌరు గెలుపుతో మొక్కు తీర్చుకున్న కార్యకర్త

విశాలాంధ్ర - పాణ్యం : ఎమ్మెల్యేగా గౌరు చరితా రెడ్డి గెలిచి టీడీపీ అధికారంలోకి వస్తే 101 టెంకాయలు కొడతానని మొక్కుకున్న కార్యకర్త మంగళవారం అట్టహాసంగా తన మొక్కులు తీర్చుకున్నాడు. మండలంలోని కందికాయపల్లె గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మండ్ల ఈశ్వరయ్య స్థానిక పెద్దమ్మ ఆలయం వద్ద 101 టెంకాయలు కొట్టి తన మొక్కుతీర్చు కున్నాడు. ఇంటి వద్ద నుంచి అమ్మవారికి కుంకుమ, పసుపు ప్రత్యేక సారెతో ఊరేగింపుగా టిడిపి కార్యకర్తలు, నాయకులతో డప్పులు, టపాకాయల మోతలతో ర్యాలీగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నాడు. నాయకులు బాలస్వామి, నారాయణ, లక్ష్మయ్య, రమేష్, పరమేష్, శివశంకర్, నాగన్న, నాగేంద్ర, శివ, రాజేష్, రామకృష్ణ, గోవిందు, సుబ్బు, రవి, పరమేష్, ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఓవర్ హెడ్ ట్యాంకు

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రిలో 33 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఓవర్హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. పెద్దమకానం వీధిలో పాలకులు, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకు ఏర్పాటు చేయించారు. ఈ ట్యాంకు ద్వారానే గ్రామంలో కొళాయిల ద్వారా మంచి నీరు సరఫరా అయ్యేది. ట్యాంకు దెబ్బతినడంతో ఎనిమిదేళ్లుగా వినియోగించడం లేదు. ట్యాంకు అడుగు భాగం నుంచి పెచ్చులూడిపడుతున్నాయి. స్థానికులు ఆందోళన చెందు తున్నారు. ట్యాంకును కూల్చివేసి ప్రమాదం జరుగకుండా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. కూల్చివేతకు ఉన్నతాధి కారుల అనుమతి కోసం ప్రతిపాదన చేశామని, ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య పేర్కొన్నారు.

హెల్మెట్ ధరించండి ప్రాణాలు రక్షించుకోండి

విశాలాంధ్ర-డోన్ రూరల్: హెల్మెట్ ధరించండి ప్రాణాలు రక్షించుకోండి అని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ అమరావతి మరియు జిల్లా రవాణా శాఖ అధికారి జివి శివారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఆర్టిఓ ఆఫీస్ వద్ద మోటార్ సైకిల్ వాహనదారులకు హెల్మెట్ ధరించడం గురించి అవగాహన కార్యక్రమం కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ వాహనాన్ని నడిపేవారు రోడ్డు నిబంధనలు పాటించడం, వేగ నియంత్రణ కలిగి ఉండాలని, వాహనాలు నడిపేవారు కుటుంబ సభ్యులు తమపై ఆధారపడ్డారన్న విషయం మరచిపోకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. మేమున్నాం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : అధైర్య పడొద్దు.. మేము న్నామంటూ తోటి కార్మికుని కుటుంబానికి ఆళ్లగడ్డ భవన నిర్మాణ కార్మిక సంఘం మరోసారి చేయూత నందించింది.. ఇటీవల నల్లవాగుపల్లెలో నివసించే మహబూబ్ బాష అనే కార్మికుడు ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగి మరణించడం జరిగింది.. ఆళ్లగడ్డ భవన నిర్మాణ కార్మిక సంఘంలో ఉన్న ప్రతి ఒక్కరు స్పందించి వారి వారికి తోచిన విధంగా సహకారం అందించగా మొత్తం రూ.26,600 సంఘం పెద్దలకు అందజేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం పెద్దలు చిన్న ఉసేన్ వలి, కంబగిరి, శివదస్తగిరి, శ్రీను, లక్ష్మన్న, నాగరాజు, కిషోర్, సురేంద్ర తదితరులు కలిసి, కుటుంబాన్ని పరామర్శించి, మేమున్నామంటూ ధైర్యం చెప్పి, మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.26,600 నగదుగా అందజేశారు. ఈ సందర్భంగా మరణించిన వ్యక్తి వారి కుటుంబ సభ్యులు ఆళ్లగడ్డ భవన నిర్మాణ కార్మిక సంఘానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నకిలీ విత్తనాలు, పేదలకు ఇళ్ల స్థలాలపై దృష్టి సారించాలి : సీపీఐ

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల జిల్లా నూతన కలెక్టర్ రాజకుమారిని కలిసి జిల్లాలో నకిలీ విత్తనాలు, అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, జిల్లాలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని సీపీఐ నాయకులు కోరారు. నూతనంగా వచ్చిన కలెక్టర్‌కు సీపీఐ నాయకులు పూల బోకే ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబాఫక్రుద్దీన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్, మోటారాముడు, నాగరాముడు, జిల్లా సమితి సభ్యులు జి సోమన్న, డి శ్రీనివాసులు, ఆర్ సామేలు, హరినాథ్, భార్గవ్, సంజీవులు, ఆర్ మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ జిల్లాలో అధికారం అడ్డం పెట్టుకొని దేశ వ్యాప్తంగా నకిలీ విత్తనాలను సరఫరా చేసి కోట్ల రూపాయలకు అధిపతులు అయినారని, గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో పేరిట పేదలకు ఇల్లు నిర్మించి ఇస్తామని హామీలు ఇచ్చి అధికార పార్టీ నాయకుల అనుచరులకే స్థలాలను ఇవ్వడంజరిగిందని విమర్శించారు. జిల్లాలో రైతుల సమస్యలు, ప్రభుత్వ భూముల కబ్జా సమస్యలు, రోడ్ల సమస్యలు లాంటి అనేకం ఉన్నాయని వాటిపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించే దిశలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని నాయకులు తెలిపారు.

జలమయంగా మారిన ఆత్మకూరు..

విశాలాంధ్ర-ఆత్మకూర్ రూరల్ : పట్టణంలో సోమవారం రాత్రి దాదాపు 2 గంటలు ఎడతెరప లేకుండా కురిసిన వానకు ఆత్మకూరు పట్టణం లోని లక్ష్మీ నగర్, ఏకలవ్య నగర్, స్వరాజ్ నగర్, సాయిబాబా నగర్‌లో లోతట్టు ప్రాంతాలు మొత్తం జలమయమ య్యాయి. లక్ష్మీ నగర్‌లో ఇల్లు జల మయం కావడంతో సీపీఐ తాలూకా కార్య దర్శి టి.ప్రతాప్ అక్కడిక వెళ్ళి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు చాలా దుర్భరమైన పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఆత్మకూరు పట్టణంలో గత కొన్ని సంవత్సరాలు నుండి ఈ లోతట్టు ప్రాంతాల్లో మొత్తం సరైన డ్రైనేజీ కాలువలు లేనందువలన ప్రతిసారి వర్షాకాలంలో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎన్ని ప్రభు త్వాలు మారినా సరే, ఈ బీద ప్రజల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. గత ప్రభుత్వం ప్రజల ను కేవలం తమ ఓటు బ్యాంకుకు ఉపయోగించుకు న్నారని, ఎటువంటి మంచి చెయ్య లేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్న ప్రజల సమస్యలు తెలుసుకొని వారిని ఆదుకోవాలి అన్నారు. ఈ వరద నీరు ఇళ్లలో చేరడం వల్ల విషపూరితమైన పాములు, తేళ్లు వస్తున్నాయని, పిల్లలు, పెద్దలు భయాందోళనకు గురవుతున్నారన్నారు.

అవినీతి ప్రభుత్వానికి అంతం..

- ప్రజా ప్రభుత్వానికి పునాది
- ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం
- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

విశాలాంధ్ర-అవుకు: అవినీతి ప్రభుత్వం అంతమయి ప్రజా ప్రభుత్వానికి పునాదులు పడ్డాయని రోడ్లు భవనాలు మరియు మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖామంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం అవుకు పట్టణంలోని ఎస్సార్ బీసీ గెస్ట్ హౌస్ లో మండల పరిధిలోని నాయకులు కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అవుకు పట్టణానికి చేరుకున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయినా ఆయన వారి గ్రామాలకు సంబంధించిన సమస్యలను, త్వరితగతిన పూర్తి చేయాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో పూర్తి చేయాల్సిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వానికి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పారని ప్రజా ప్రభుత్వానికి ప్రజల పునాదిరాళ్లు వేశారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ప్రజలకు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గూడాల సోదరులు మురళీధర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, చల్లా విజయ భాస్కర్ రెడ్డి, కాటసాని చంద్రశేఖర్ రెడ్డి, మోట్ల రామిరెడ్డి, వంగల పరమేశ్వర్ రెడ్డి, ఉగ్రసేనారెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, మద్దిలేటి గౌడ్, వెంకటరమణ నాయక్, దంతల రమణ, గుడిపాటి రామకృష్ణ, కైప చంద్రశేఖర్ రెడ్డి, కైప వెంకటరామిరెడ్డి, మంచాల ప్రతాపరెడ్డి, సంఘపట్నం వీరారెడ్డి, సాంబశివారెడ్డి, రవి నాయుడు, అరుణ్ నాయక్, వెంకట్రాముడు నాయక్, గుడిపాటి అరవిందు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపాన్ని నివారించండి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర- నంద్యాల: రాష్ట్రవ్యాప్తంగా డయారియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో ఎక్కడా పారిశుద్ధ్యం లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య లోపాలపై ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ సాధారణంగా తాగు నీటి కలుషితం వల్లే డయేరియా కేసులు నమోదయ్యే ప్రమాదం వుందని, గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో ఎక్కడా పారిశుద్ధ్య లోపాలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలోని ఓఆర్హెచ్ఎస్, పిడబ్ల్యుడి స్కీముల ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయడంతో పాటు సంబంధిత తేదీలను బోర్డులపై ప్రదర్శించాలన్నారు. తన ఆకస్మిక పర్యటనలో తప్పక పర్యవేక్షిస్తానన్నారు. వర్షాకాలంలో మురికి కాలువల శుభ్రం తో పాటు చెత్త కుప్పలు ఉండడం వల్ల దోమలు పెరిగే అవకాశం ఉందని ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్ యార్డులలు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలోని పంచాయతీ సెక్రటరీలు, ఈవోపీఆర్డీలు బాధ్యతాయుతంగా ఉండి పారిశుద్ధ్య చర్యలను ముమ్మరంగా చేపట్టాలన్నారు. గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న ఓఆర్‌హెచ్ఎస్, ఇతర నీటి వనరుల మరమ్మత్తులకు సంబంధించి ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు ఇవ్వాలని ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో అభివృద్ధికి సంబంధించి అనేక అంశాలు ఉంటాయని వాటిని పరిష్కరించడంతో పాటు ప్రధాన అంశాలను తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వర్తమాన కాలంలో నీటి సమస్య లేదని పబ్లిక్ హెల్త్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈలు కలెక్టర్ కు నివేదించారు. జిల్లాలో రెండు సమగ్ర రక్షిత నీటి పథకాలు మినహా, మిగిలిన 27 సిపిడబ్ల్యూఎస్ స్కీములు పని చేస్తున్నాయని, ప్రస్తుతానికి త్రాగునీటి సమస్య లేదని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ వివరించారు. ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన బొజ్జా దశరథరామిరెడ్డి

విశాలాంధ్ర - నంద్యాల : రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో సమితి కార్యవర్గ సభ్యులు జిల్లాకు నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజకుమారిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి అంశాలతో పాటు ప్రధానంగా నంద్యాల జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, నీటి లభ్యతలపై కలెక్టర్ కు బొజ్జా వివరించారు. గోరుకల్లు రిజర్వాయర్ ప్రమాదపుటంచులలో వుందని కలెక్టరుకు తెలిపారు. జిల్లాలో అత్యంత పురాతనమైన కేసి కెనాల్ ఆయకట్టుకు ఏరోజు వరకు నీటిని అందిస్తారో చెప్పలేని పరిస్థితి ఉండటంతో ఏ పంటలు వేసుకోవాలో, వేసిన పంటలకు నీరందుతుందో లేదో అన్న మనోవేదనతో రైతులు వ్యవసాయం కొనసాగిస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. సాగునీటి జిల్లా సాగునీటి వనరులు, ప్రాజెక్టుల గురించి కలెక్టర్ బొజ్జాతో చర్చించారు. ఈ సందర్భంగా తాను రచించిన నీటి అవగాహనే రాయలసీమకు రక్ష పుస్తకాన్ని కలెక్టర్‌కు బొజ్జా అందచేసారు. సాగునీటి అంశాలను తెలుసుకోవాలని వున్నా ప్రస్తుతం సమయం లేనందువలన త్వరలో మలి విడత భేటీలో సాగునీటి అంశాలను చర్చిద్దామని ఈ సందర్భంగా కలెక్టర్ బొజ్జాకు తెలిపారు. కలెక్టర్ తో భేటీ అనంతరం మీడియాతో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులపై కలెక్టర్ కు వివరించినప్పుడు వారి స్పందన బాగుందన్నారు. కలెక్టర్‌ను కలిసిన బృందంలో సమితి ఉపాధ్యక్షులు వైఎన్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు వున్నారు.

పామ్ ఆయిల్ తోటలను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: పామ్ ఆయిల్ తోటలను ప్రోత్సహించాలని అగ్రికల్చర్ ఏడిఏ రాజశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని పొదుపు భవనం నందు గ్రామ స్థాయిలోని వ్యవసాయ మరియు అనుబంధ సహాయకులకు డి.రాజశేఖర్ ఏడిఏ అధ్యక్షతన, మరియు ఉద్యాన అధికారి రఘువరన్, తుమ్మల అగ్రోస్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శ్రీ. తుమ్మల ఆంజనేయులు, ఫీల్డ్ ఆఫీసర్ మద్దిలేటి, పామ్ ఆయిల్ తోటల సాగు లాభాలు, రాయితీ వివరాల గురించి వ్యవసాయ సహాయకులకు తెలియజేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి జిల్లాలో పెద్ద ఎత్తున పామ్ అయిల్ తోటల సాగును ప్రోత్స హించడానికి ముందుకు వచ్చిందని. గ్రామ వ్యవసాయ సహాయకులు తమ తమ గ్రామాలలో ఆసక్తి చూపిన రైతుల వివరాలను ఉద్యాన అధికారి లేదా పామ్ ఆయిల్ కంపెనీ వారికి ఇచ్చినచో ఆ రైతులకి మొక్కలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు సరఫరా చేసి నాటించడం జరుగుతుంది అని తెలియ జేశారు. గ్రామ వారీగా ఇచ్చినటువంటి మట్టి పరీక్షల పూర్తి చేయాలని, అర్హత పొందిన అర్హత కలిగినటువంటి కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులు పొందేటట్టుగా చేయాలని తద్వారా కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు యిప్పించే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఓబులేసు, వ్యవసాయ సహాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ బైరెడ్డి శబరి

విశాలాంధ్ర - నంద్యాల : జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ జి.రాజకుమారిని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా రైతులకు పంటలు సాగుచేసుకునేందుకు సాగునీరు అందించాలని, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమస్య లేకుండా చూడాలని ఎంపీ శబరి జిల్లా కలెక్టర్ రాజకుమారిని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఎంపీ శబరి విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో జిల్లాలోని కేసి కెనాల్, తెలుగుగంగ, ఎస్ఆర్ బిసి ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరు అందించక అనేక కష్టాలు పడ్డారని, పంటలు ఎండిపోయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, రైతులకు సాగునీరు ఇవ్వలేం అంటూ అధికారుల ద్వారా రైతులకు నోటీసులు ఇచ్చిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కిందని శబరి విమర్శించారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మండలంలో తగ్గిన పంటల సాగు విస్తీర్ణం

- అందుబాటులోకి రాని విత్తనాలు, ఎరువులు



విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: ఖరీఫ్ సీజన్లో మండలంలో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 2,725 హెక్టర్లు కాగా ఇప్పటి వరకు కేవలం 138 హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేశారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 67 మి.మీ. కాగా 175 ఎంఎం వర్షపాతం నమోదయింది. రైతులు పంటలు సాగు చేసేందుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలో 11 రైతు సేవా కేంద్రాలు ఉండగా ఇప్పటి వరకు విత్తనాలు, ఎరువులు మంజూరు కాలేదు. దీంతో రైతులు అధిక ధరలు చెల్లించి పట్టణ ప్రాంతాల్లో కొనుగోలు చేయవలసి వస్తోంది. ఇంజేడు, హరివరం, పుచ్చకాయలపల్లె, ఉయ్యాలవాడ, ఆర్.జంబులదిన్నె, సర్వాయిపల్లె, పెద్దయమ్మ నూరు, గ్రామాల్లో మొక్కజొన్న 74 హెక్టార్లు, మినుము 46, పత్తి 11, వేరుశనగ 5, బంతిపూలు 2 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ఖరీఫ్ లో కంది, వేరుశనగ, పెసర, సోయాబీన్, ఆరుకా వంటి చిరుధాన్యాలు కూడా సాగు చేసేందుకు విత్తనం అందుబాటులో లేక పంటలు సాగు చేయలేకపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ సగ కాలం గడియడంతో గత 20 రోజులు నుండి వర్షాలు కురవకపోవడంతో రైతులు పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు.

మద్దిలేటి మృతి బాధాకరం : రాజారెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె: పట్టణంలోని కొండపేట కాలనీకి చెందిన సలికమేని మద్దిలేటి (50) అకాల మృతి బాధాకరమని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. మంగళవారం విషయం తెలుసుకున్న బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మృతుని ఇంటికి చేరుకొని భౌతికయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్ర సమీపంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఎదురుగా ప్రధాన రహదారిపై జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు మండలంలోని బెలుం గ్రామానికి చెందిన శేఖర్ (25) అనే లారీడ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సంజామల మండలం తుడుములదిన్నె గ్రామంలో శేఖర్ వివాహం చేసుకొని ఇటీవల అక్కడే నివాసం ఉంటున్నాడు. లారీ డ్రైవర్గా వెళ్లిన శేఖర్ అనంతపురం జిల్లా తాడపత్రి లో డ్యూటీ ముగించుకుని మోటార్ బైక్ పై తుడుములదిన్నెకు వెళ్తుండగా కొలిమిగుండ్ల సమీపంలో ఎదురుగా వస్తున్న జీపు ఢీకొన్నది. బైక్ నుండి కింద పడ్డ శేఖర్‌కు తీవ్ర గాయాలు కావడంతో తాడపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దేవాలయ భూములకు వేలం పాటలు

విశాలాంధ్ర - రుద్రవరం: మండలంలోని భాస్కర నందీశ్వర, ఆంజనేయ, దొర్ని లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలకు సంబంధించిన భూముల కౌలు వేలం పాటలు నిర్వహించారు. మంగళవారం ఆలయ కార్య నిర్వహణ అధికారి సాయి జయ చంద్రారెడ్డి మాట్లాడుతూ మూడు దేవాలయాలకు సంబంధించి 36.79ఎకరాల భూములు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి వేలంపాటలు నిర్వహించగా రూ.3,31,500 రాగా గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.81,500 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. దేవాలయ ఇన్‌స్పెక్టర్ కార్తీక్, పలువురు దేవాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

విశాలాంధ్ర-చాగలమర్రి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని త్రీమెన్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. మంగళవారం త్రీమెన్ కమిటీ సభ్యులు తహశీల్దార్ వెంకటరమణమ్మ, ఎంపీడీఓ సూర్య నారాయణ రెడ్డి, ఎంఈఓ అనురాధలు మధ్యాహ్న భోజన పథకంలో భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా, గుడ్లు, చిక్కీలు సక్రమంగా ఇస్తున్నారా.. లేదా అని ఆరా తీసారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటయ్య పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఆర్టిస్ట్ విజయ్

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌కు ఆళ్లగడ్డ తాలుకా వినియోగదారుల సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆర్టిస్ట్ విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ నిరుపేదలకు కనీస అవసరాలు అయిన బియ్యం, కందిపప్పు ఆకాశానికి అంటాయన్నారు. దీంతో మంత్రి నాదెండ్ల మనోహర్ వాటి ధరలను తగ్గించి విక్రయించాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఆయన ఆదేశాల మేరకు గురువారం నుండి కందిపప్పు కిలో రూ.181 కాగా రూ.160కు, అలాగే బియ్యం కిలో రూ.52 కాగా రూ.48కు, స్టీముడు బియ్యం కిలో రూ.55.80 కాగా రూ.49కు తగ్గించి బహిరంగ మార్కెట్లో విక్రయాలు జరిగేలాగా చర్యలు చేపట్టాలని సంతోషించదగ్గ విషయమని ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గూడాల శివరామిరెడ్డిని పరామర్శించిన మంత్రి

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని కునుకుంట్ల తెలుగుదేశం సీనియర్ నాయకులు గూడాల శివరామిరెడ్డిని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. కునుకుంట్ల గ్రామానికి చేరుకున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి తెలుగుదేశం నాయకులు గుడాల ప్రతాపరెడ్డి, గూడాల మురళీధర్ రెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మంత్రికి వరసకు చిన్నాన్న అయినా గుడాల శివరామిరెడ్డి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గూడాల కుటుంబంతో తనకు 40 ఏళ్ల నుంచి అనుబంధం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మండలంలో టీడీపీకి పట్టు ఉన్న గ్రామాలలో కునుకుంట్ల కూడా ఒకటి. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ కునుకుంట్ల గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాను అని అన్నారు. ఉప సర్పంచ్ గూడాల రామకృష్ణారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

మా ఊరి పాఠశాలకు తాళం వేస్తాం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : మండల పరిధిలో ఉన్న కందనాతి గ్రామంలోని ఓ పాఠశాలలో టీచర్ల కొరత ఉంది. గతంలో నాలుగురు టీచర్స్ ఉండేవారు. ఇప్పుడు ఒక టీచర్ మాత్రమే ఉన్నారు. మా పిల్లలు అస్సలు చదవడం లేదని, మాకు ముగ్గురు టీచర్లు అవసరం అని స్కూల్ పిల్లల తల్లిదండ్రులు ఒక్క సంవత్సరం పాటు ఎంఈవో ఆఫీస్ చుట్టు తిరిగినా ప్రయోజనం లేదు. అదిగో పంపిస్తాం, ఇదిగో పంపిస్తాం అంటున్నారే తప్పా ఇంత వరకు ఒక్క టీచర్‌ను కూడా ఎంఈవో పంపించలేదు. మా పిల్లలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఇంత నిర్లక్ష్యం చేస్తున్న ఎంఈవోను సస్పెండ్ చేయాలి, లేదా మా స్కూల్ అయినా మూసివేయండి అని తల్లిదండ్రులు బాధను వ్యక్తం చేస్తున్నారు. ఉన్న ఒక్క టీచర్ రోజంతా పిల్లలకు హాజరు వేయడానికి మాత్రమే సరిపోతుంది తప్పా, మా పిల్లలకు చదువు చెప్పడము లేదని, ఈ స్కూల్‌కు తాళం వేసి మా పిల్లలను పొలాలకి పంపిస్తాం, వేసవికాలంలో వలసకు తీసుకెళ్తాం, మా స్కూల్‌ను ఎంఈవో పట్టించు కోవడం లేదని, మా పిల్లలకు చదువు చెప్పనపుడు స్కూల్ ఎందుకని కందనాతి గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు డీఈవో ఆఫీస్‌ను ముట్టడిస్తాం : ఎమ్మిగనూరులో విద్యార్థి సంఘాల వారు ప్రైవేట్ స్కూళ్లపైన మాత్రమే పోరాటం చేస్తున్నారాని వార్తలు వస్తున్నాయి, ఒక సారి కందనాతి స్కూల్ వైపు చూడండని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల నాయకులను విన్నవిస్తున్నారు.

స్వేచ్ఛగా పురుగుల మందు వ్యాపారాలు

- ఓ దుకాణదారుడు బోర్డు లేకుండానే విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర -కల్లూరు: అనుమతులు లేని పురుగు మందులను వ్యాపారస్తులు స్వేచ్ఛగా విక్రయించడమే కాకుండా కనీసం దుకాణాలకు బోర్డులు కూడా పెట్టకుండా స్వేచ్ఛగా మందులు విక్రయిస్తూ ఆదాయాలు అర్జిస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ముందు ఓ పురుగుల మందు వ్యాపారి కనీసం బోర్డు, స్టాక్ వివరాలు మందుల రేట్లు తెలిపే బోర్డులు అమర్చకుండా పురుగుమందులను విక్రయిస్తూ వ్యాపారం సాగిస్తున్నారు. ఈ విషయంపై కనీసం బోర్డు లేకుండా వ్యాపారం చేస్తున్నారని అడిగితే మాకు షాపులు మార్చుకోవడం అలవాటే అధికారులు కూడా మేము చెప్పినట్టే వింటారు అనడం శోచనీయంగా ఉంది. పురుగుల మందులు ఒక లీటర్ రూ.120 ఉంటే డీలర్లు మాత్రం రూ.600 పైగా ఎలాంటి బిల్లులు లేకుండా విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. రైతులు అధిక శాతం పురుగుల మందులను అరువుపై కొనుగోలు చేయడంతో ఇష్టానుసారంగా ఎలాంటి బిల్లులు లేకుండా వారి రికార్డులు నమోదు చేసుకుని అధిక వస్తువులకు పాల్పడుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనేక కంపెనీ యాజమాన్యం అనుమతులులేని మందులను డీలర్లు విక్రయించేందుకు వారికి మభ్యపెట్టి అధిక ఆదాయాలు వచ్చే మార్గాలను బంగారు గిఫ్ట్ విందు చిందులు రకరకాల వ్యామోహాలకు డీలర్లను ఆశ చూపి అనుమతులు లేని మందులను ప్రభుత్వం బ్యాన్ చేసిన మందుల సైతం షాపులలో విక్రయించేలా చేస్తున్నారనే విమర్శలు నెలకొన్నాయి. ఫార్ములా 4 ఒక లీటరు వంద రూపాయలు పడితే డీలర్లు రూ.500 విక్రయిస్తున్నారని విమర్శలు నెల కొన్నాయి. ఫార్ములా 6 ఒక లీటరు రూ.150 పడితే రూ.600 డీలర్లు రైతులకు ఎలాంటి బిల్లులు లేకుండా కట్టబెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడ్డి ప్యాకెట్లను ప్రభుత్వం వాటి వల్ల క్యాన్సర్ తదితర రోగాలకు గురవుతారని కొన్ని కంపెనీలను బ్యాన్ చేసినప్పటికీ గోప్యంగా ఆయా కంపెనీలు ఏజెన్సీలకు సరఫరా చేస్తుండడంతో రైతులకు గడ్డి మందులను కట్టబెట్టి వాటిని పొలాల్లో పిచికారి చేసేలా చేయడంతో ప్రజలు రైతులు అనారోగ్యాల బారిన పడుతున్నారని విమర్శలు నెలకొన్నాయి. గ్లైకోసెట్ గడ్డి మందు 41 ఎస్ఎల్ ఈ మందులను ప్రభుత్వం బ్యాన్ చేసినప్పటికీ డీలర్లు మందులను విక్రయిస్తున్నారనే సమాచారం సంబంధిత అధికారులకు ఉన్నప్పటికీ పట్టించు కోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు డీలర్ల దగ్గర కొనుగోలు చేసిన మందులను పంటలకు పిచికారి చేయడంతో డోసులు ఎక్కువయ్యి పంటలు సరిగా రాక చేతికొచ్చిన పంటల సైతం కళ్ళముందే ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. పెస్టిసైడ్ మందులు కంపెనీ బ్రాండ్ లేకుండా ఆదాయం వచ్చే మందులను మాత్రమే డీలర్లు ఎక్కువ శాతం విక్రయిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఫెర్టిసైజ్ లేకుండా జింకు ఫార్ములా ఫోర్ ఫార్ములా సిక్స్ సస్యపాలు గ్రావెల్ వివిధ రకాల మందులు మెగ్నీషియం మూడు పంతొమ్మిదిలో 20 20, 28 28, 03 తదితర రకాల ఎరువులను విక్రయించాల్సి ఉండగా వాటిపై ఆదాయాలు తక్కువగా ఉన్నాయని అనుమతులు లేకుండా దుకాణాలను నిర్వహించడంతోపాటు అధిక ఆదాయాలు వచ్చే మందుల వైపు డీలర్లు మక్కువ చూపుతూ రైతాంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆయా గ్రామాల్లోని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై ఏవో శ్రీనివాస్ రెడ్డిని వివరణ కోరగా అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తే సీజ్ చేస్తామని, దుకాణాలకు స్టాక్ వివరాలు బోర్డులు తప్పనిసరిగా అందుబాటులో రైతులకు ఉంచాలని తెలిపారు.

మూసీ నదిగా మారిన కేసీ కెనాల్ : సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కేసీ కెనాల్ మూసీ నదిగా మారిందని దుర్గంధం వెదజల్లుతూ ప్రజలను అనారోగ్యం పాలు చేస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె జగన్నాథం, నగరకార్యదర్శి పీ రామకృష్ణారెడ్డిలు విమర్శించారు. మంగళవారం కేసీ కెనాల్ వద్ద నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీ కెనాల్‌లో చెత్తాచెదారం వేయడంతోపాటు డ్రైనేజీ నీరు వదలడం వలన దోమలకు ఆవాస కేంద్రంగా మారిందన్నారు. దోమ కాటువలన నగరంలోని ప్రజలు రోగాల బారిన పడుతున్నారని విమర్శించారు. కేసీ కెనాల్‌ను శుద్ది చేసి అందులో ఉన్న చెత్తా చెదానం తొలగించాలన్నారు. డ్రైనేజీ నీటిని కేసీలోకి వదల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టిసారించి సత్వరమేచర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శులు సి.మహేష్, డి.శ్రీనివాసరావు ,నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, ఈశ్వర్, బీసన్న, అన్వర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసులు, సురేంద్ర, కృష్ణ, రామాంజనేయులు గౌడు, దొడ్డిపాడు బాష, శ్రీకాంత్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తాం : ఎంపీ

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: ఎయిమ్స్ తరహాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను అభివృద్ధి చేస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు చెప్పారు. మంగళవారం ఆయన ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డితో కలిసి పలు వార్డులను సందర్శించి ఇక్కడ అందుతున్న సౌకర్యాలు, చికిత్సల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ తో ఆయన వైద్యశాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ డెవలప్మెంట్ కమిటీని ఏర్పాటు చేసి ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఇక గత ప్రభుత్వంలో సరైన వైద్య సదుపాయాలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు.ఇప్పుడు అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఆసుపత్రికి వచ్చే రోగులకు కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో వైద్య సేవలను అందించేలా కృషి చేస్తానని తెలిపారు. ఆసుపత్రి సిఎస్ఆర్ ఎంఓ, డా.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఎస్ఆర్ ఎంఓ డా.హేమామలిని, ఏఆర్ఎంఓ డా.వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివబాల నగాంజన్ పాల్గొన్నారు.

నేను బడికి పోతా..

విశాలాంధ్ర - పెద్ద కడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరులో మండల విద్యాధికారి రామ్మూర్తి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జీ సునీత ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల నుంచి ఆడ పిల్లల చదువు - అవనికి వెలుగు, పెద్దలు పనికి పిల్లలు బడికి, బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి అంటూ నినాదాలు చేస్తూ గ్రామ పురవీదుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణంలో మానవహారం నిర్వహించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ స్వర్ణలత, ఉపాధ్యాయులు చంద్రకళ, మల్లికార్జున పాల్గొన్నారు.

వ్యర్థ పదార్థాలను తొలగించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి : సీపీఐ

విశాలాంధ్ర- ఎమ్మిగనూరు : పట్టణానికి తాగునీరు ప్రవహించే ఎల్ఎల్సీ కాలువలో పడి ఉన్న వ్యర్థ పదార్థాలను తొలగించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఎల్లెల్సీ కాలువను మంగళవారం పరిశీలించడం జరిగిందని సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరి కొన్ని రోజులలో తుంగభద్ర ప్రాజెక్టు నుండి నీరు విడుదల చేయడం జరుగుతుందని, నీరు విడుదల అవుతున్న సందర్భంగా వ్యర్థ పదార్థాలతో నిండి ఉన్న ఎల్లెల్సీ కాలువను శుభ్రం చేయడంలో బోర్డు అధికారులు, పట్టణ ప్రజల తాగునీరును ఉపయోగిస్తున్న సందర్భంగా మున్సిపల్ అధికారులు కూడా వ్యర్థ పదార్థాలను తొలగించలేకపోవడం బాధాకరమన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా వచ్చే నీరు ఎల్లెల్సీ కాలువలో కలుషితమై పట్టణ ప్రజలకు తాగడానికి ఆ నీరును సరాపర చేయడం వల్ల ప్రజలు రోగాల బారినపడి ఆసుపత్రి పాలవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యల పట్ల శ్రద్ధ వహించి మున్సిపల్ అధికారులు లేక ఎల్లెల్సీ బోర్డు అధికారులు తక్షణమే స్పందించి కాలువలో పడి ఉన్న వ్యర్థ పదార్థాలను తొలగించాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు బజారి, కెసి జబ్బర్, తిమ్మ గురుడు, వీరేష్, విజయేంద్ర, మల్లికార్జున గౌడ్, ఖాజా, రవి నరసింహులు, అజార్, రమేష్, నాగన్న, నర సింహులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో పసి బాలుడు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: విద్యుత్ షాక్‌కు గురై పసి బాలుడు హుస్సేన్(5)తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడు తున్న ఘటన ఇస్వి గ్రామంలో చోటు చేసుకుంది. మంగళ వారం బసవరాజు, ఈరమ్మ దంపతుల కుమారుడు ఉదయం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి వెళ్లగా, కడి తోటకు వెళ్లే రహదారి పక్కన రెండు అడుగుల ఎత్తులో ట్రాన్సుఫర్మర్ ఉండగా అనుకోకుండా బాలుడికి హెడ్ ఫీజ్ తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యారు. గమనించిన స్థానికులు కర్రతో బాది బాలుడిని తప్పించారు. బాలుడుకి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.గాయపడిన బాలుడుని పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళాలని సూచిం చారు. ఉదయం అంగన్వాడి కేంద్రానికి వెళ్లిన బాలుడు బయటకు ఎలా వెళ్లాడు. అంగన్వాడి టీచర్, ఆయా ఏమి చేస్తున్నట్టు అన్యం పుణ్యం మెరుగని పసి పిల్లలకు భద్రత ఎక్కడ.. ఇటువంటి ఘటనపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ యువ నాయకుడు పులి రాజు నాయకులతో కలిసి చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించారు.

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యమే బాలుడి ప్రమాదానికి కారణం : ట్రాన్స్‌కో అధికారులు రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు కానీ కంచ అమర్చడంలో నిర్లక్ష్యానికి వహించారు. భూమికి రెండు అడుగుల ఎత్తులో ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయడం వలననే ఈ ఘటన చోటు చేసుకుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్రాన్స్‌ఫారంను 6 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసి చుట్టూ కంచ నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రానికి పరిశ్రమలన్నీ తిరిగొస్తున్నాయి : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఐదేళ్ల క్రితం వెళ్లిపోయిన పరిశ్రమలన్నీ తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలులోని ఆర్టీసీ బస్టాండులో 6 నూతన బస్సులను ఎంపీ నాగరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అంటేనే అందరికీ ఒక నమ్మకమన్నారు. ఐదేళ్ల క్రితం గన్నవరం నుండి వెళ్లిపోయిన అశోక్ లేలాండ్ యూనిట్ మళ్లీ తమ యూనిట్‌ను ప్రారంభించేందుకు ముందుకు వచ్చిందన్నారు. దీంతో పాటు ఇంకా ఎన్నో పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నట్లు చెప్పారు. ఇక కర్నూలు ఆర్టీసీ బస్టాండును రాష్ట్రంలోనే బెస్ట్ బస్టాండుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా బస్టాండును అభివృద్ధి చేయడంతో పాటు ఆర్టీసికి ఆదాయం వచ్చేలా ముందుకు వెళతామన్నారు. త్వరలోనే కర్నూలు ఆర్టీసీ బస్టాండులో ఉన్న సమస్యలపై సమీక్ష నిర్వహిస్తానని మంత్రి తెలిపారు. ఇప్పుడు ప్రారంభించిన 6 బస్సులే కాకుండా ప్రయాణీకులకు అవసరమైతే మరిన్ని బస్సులు ఏర్పాటుచేసేందుకు సిద్ధమన్నారు. ఇక త్వరలోనే విజయవాడ నుండి కర్నూలుకు విమాన సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి చర్చించినట్లు తెలిపారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు అన్నీ అమలుచేసే దిశలో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్.ఎం శ్రీనివాసులు, డీఎంలు సుధారాణి, సద్దాం హుశేన్, తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ ఉన్న ఆటోలో మాత్రమే ప్రయాణించండి

విశాలాంధ్ర - కర్నూలు క్రైం : కర్నూల్ నగరంలోని ఆటోలకు క్యూఆర్ కోడ్ వేస్తున్నామని అటువంటి కోడ్ ఉన్న ఆటోలో ప్రయాణికులు ప్రయాణించి సురక్షితంగా గమ్యం చేరాలని కర్నూల్ ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, రవి, భాష కోరారు. సోమవారం నుండి కర్నూలులో ఉన్న ప్రతి ఆటోకు క్యూఆర్ కోడ్ వేస్తున్నట్లు వారు తెలిపారు. క్యూఆర్ కోడ్ ఉన్న ఆటోలో ప్రయాణించేవారు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటో యజమాని పూర్తి వివరాలు అందులో ఉంటాయని వారు తెలిపారు. ఆటోలో ప్రయాణించడం వల్ల ఆటోలో ఏవైనా వస్తువులు మరచి పోయినా, ఇతర ఇబ్బందులు కలగకుండా సురక్షితంగా ప్రయాణించవచ్చని వారు తెలిపారు. కర్నూలులోని ఆటో డ్రైవర్లు తమతమ ఆటోలకు క్యూఆర్ కోడ్లు వేయించుకొని ఒక బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. క్యూఆర్ కోడ్ వేయించుకునే ఆటో వారు వారి ఫొటోలను, ఆర్సీ, ఇన్సూరెన్స్, లైసెన్స్ తీసుకుని యూనియన్ నాయకులను సంప్రదిస్తే క్యూ ఆర్ కోడ్ వేస్తామని తెలిపారు. నగరంలో వేలాదిగా ఆటోలు ఉన్నాయని ప్రయాణికుని పట్ల అనుచ్చితంగా ఎవరైనా ప్రవర్తిస్తే అది ఆటోవాళ్ళకంతా చెడ్డపేరు వస్తుందని, దీనిని అరికటందుకు క్యూఆర్ కోడ్ పద్ధతిని అనుసరిస్తునట్లు తెలిపారు. చాలామందికి ఆటోనే జీవనాధారామన్నారు. ఈనెల 15 వరకు క్యూ ఆర్ కోడ్ ఆటోలకు వేస్తున్నట్లు వారు తెలిపారు. ఆటో డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

విశాలాంధ్ర- పత్తికొండ: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబీరసూల్ డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి బృందం ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధి హామీ పనులను చేపట్టి, ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని చేసిన కూలీలకు ఆరువారాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఉపాధి హామీ మేటీలకు గౌరవ వేతనం రూ.5 వేలు ఇవ్వాలని, పండ్ల తోటలు పెంచుకోవడానికి చిన్న కారు రైతులకు ఐదు ఎకరాల పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరామిరెడ్డి, నాగరాజు, నాయకులు గురుదాసు, కారన్న, పెద్ద ఈరన్న, నెట్టికంటయ్య, మాదన్న, రాజప్ప, పెద్దయ్య, ఉరుకుందు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడుదాం

విశాలాంధ్ర- పత్తికొండ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడుదామని ఎస్ టి యు రాష్ట్ర కౌన్సిలర్ కుంపటి నారాయణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి లు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయని, ఉపాధ్యాయులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీయూలో సభ్యులుగా చేరండి, సమస్యల పరిష్కరానికి చేయూత నివ్వండి అని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, బలరాముడు, ఆర్థిక కార్యదర్శి మారుతి, నాయకులు బీరప్ప, చెన్న కేశవ రావు,ఇక్బాల్ హుస్సేన్, మండ్ల వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, కృష్ణమూర్తి, మౌలేష్ పాల్గొన్నారు.

ఆహుజా స్టూడియో మాస్టర్

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : మంగళ వారం నగరంలోని బాలాజీ ఏజెన్సీస్‌లో ఏర్పాటు చేసిన ఆహుజా, స్టూడియో మాస్టర్ సౌండ్ సిస్టంల లైవ్ డెమో కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిఆర్ సిటీ డిజిటల్ అధినేత డి వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ ఎస్కే మహేష్, అహుజా సంస్థ ఏరియా సేల్స్ మేనేజర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ అహుజా కంపెనీకి సంబంధించి సౌండ్ సిస్టంలను పరిశీలించారు. వాటికి సంబంధించిన అధునాతన టెక్నాలజీ వివరాలు, సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - తుగ్గలి: మండల పరిధిలోని రాతన గ్రామంలోని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. చెరువులో తేలియాడుతున్న శవాన్ని చూసి గ్రామస్తులు ఒడ్డునకు చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తును కొనసాగిస్తున్నారు.మృతి చెందిన వ్యక్తి దగ్గర ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో, చనిపోయిన వ్యక్తి ఆచూకీ తెలిసినవారు తుగ్గలి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసు వారు ప్రజలకు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆస్పరి : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్ నాగేంద్రప్ప డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కైరిప్పల పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరించిందని ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులతో స్నేహ పూర్వకంగా ఉంటుందని ఆశిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్టీయూ మండల నాయకులు శ్రీనివాసులు, జ్యోతిమూర్తి, ఎల్లప్ప, నాగరాజు, విశ్వనాథ్, రామాంజి, ఉరుకుందు, నాగరాజు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

నగర సమగ్రాభివృద్ధికి చర్యలు : మంత్రి టీజీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగర సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రివర్యులు టీజీ భరత్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ అతిథి గృహంలో నగర పాలక సంస్థ అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముందుగా నగర పాలక సంస్థ కమిషనర్ ఏ.భార్గవ్ తేజ నగరాభివృద్ధికి సంబంధించి తీసుకుంటున్న చర్యలు, వాటి స్థితిగతులను మంత్రికి వివరించారు. గత నెల 15వ తేదీన నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాల అమలుపై మంత్రి ఆరా తీశారు. అమృత్-2 పథకానికి సంబంధించి మంజూరై, నిలిచిపోయిన జగన్నాథ గట్టు మీద రూ.130 కోట్లతో 50 ఎంఎల్‌డి నీటి శుద్ధి కేంద్రం, అలాగే 21 ఈఎస్ఎల్ఆర్ ట్యాంకుల నిర్మాణం, తుంగభద్ర నది ఒడ్డున రూ.122 కోట్లతో 35 ఎంఎల్‌డి మురుగు నీరు శుద్ధి కేంద్ర నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. నగర ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. తాగునీటి సరఫరా సాధ్యమైనంత రాత్రివేళల్లో కాకుండా పగలు సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కిడ్స్ వరల్డ్ నుంచి ఉస్మానియా కళాశాల మీదుగా కలెక్టరేట్ వరకు పెండింగ్లో ఉన్న రోడ్డు విస్తరణ పనులపై దృష్టి పెట్టాలని, రోడ్డు విస్తరణ బాధితులతో సమావేశం నిర్వహించి, వారికి తగిన న్యాయం చేయాలని అధికారులకు ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్ వద్ద యస్ఏపి క్యాంపులో నుంచి బస్టాండ్ సమీపంలో ప్రవేశించేలా రూపొందించిన 60 అడుగుల రోడ్డు విషయమై 2వ పటాలం పోలీస్ అధికారులతో మాట్లాడాలని మంత్రి సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుధ్యంపై ఇంకా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఆటోల ద్వారా చిన్నచిన్న సందుల్లో కూడా హైపో ద్రావణాన్ని పిచికారీ చేయాలని మంత్రి పేర్కొన్నారు. పూడికతీత పనులు మరింతగా వేగంగా చేపట్టాలని తెలిపారు.సమావేశంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ చంద్రమౌళి, నగర పాలక ఎస్.ఈ. డి.వేణు గోపాల్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ గుండె పోటుతో మృతి

విశాలాంధ్ర - కోడుమూరు: మండలంలోని వర్కూరు గ్రామ మాజీ సర్పంచ్, వైసీపీ నాయకులు ఎ.ఈశ్వర రెడ్డి మంగళవారం గుండెపోటుకు గురై మృతి చెందారు. కోడుమూరు పట్టణంలోని స్థానిక షణ్ముఖ రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న ఈశ్వరరెడ్డి మధ్యాహ్నం ఇంట్లో అకస్మాత్తుగా ఉన్నట్టుండి కళ్ళు తిరిగి కిందపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా, అక్కడ వైద్యులు పరీక్షించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించిన అనంతరం అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. అక్కడి నుంచి ఆయన మృతదేహాన్ని వర్కూరు గ్రామంలోని తన స్వగృహానికి చేర్చారు. జడ్పిటిసి రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ రమేష్ నాయుడు, రవికుమార్ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటగిరి వేణుగోపాల్ రెడ్డి, కృష్ణాపురం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ కుమార్ రెడ్డి, గుంతకంటి మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, లింగమూర్తి, వైసిపి నాయకులు, ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఈశ్వరరెడ్డి అకాల మృతి తీరని లోటు - కుడా మాజీ చైర్మన్ : వర్కూరు మాజీ సర్పంచ్ ఈశ్వరరెడ్డి మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా గుండెపోటుకు గురై మృతి చెందిన వార్త తెలుసుకున్న మాజీ కుడా చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి ఆదిమూలపు సతీష్, మాజీ ఎమ్మెల్యే మణి గాంధీ తదితర ప్రముఖులు వర్కూరు గ్రామానికి చేరుకొని ఈశ్వరరెడ్డి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కోట్ల హర్ష మాట్లాడుతూ మంచి మనిషి ఆత్మీయుడు, మృదుస్వభావి ఈశ్వర రెడ్డి అకాల మరణం మాకందరికీ తీరని లోటు అన్నారు. అనంతరం ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దు

విశాలాంధ్ర – నందికొట్కూరు: మీకు క్రెడిట్ డెబిట్ కార్డ్ ఉంటే సైబర్ నేరగాళ్లు కార్డు నెంబర్ ఓటిపి చెప్పమని అడిగి మీ డబ్బులు కొల్లగొడతారు, వాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని నందికొట్కూర్ రూరల్ సీఐ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని పగిడ్యాల, జూపాడుబంగ్లా, మిడుతూరు, బ్రాహ్మణ కొట్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్, క్రైమ్ నేరగాళ్లు బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నాము మీ బ్యాంక్ ఖాతా నుండి ప్రతి నెల ఈఎంఐ కట్ అవుతుందా.మీరు ఇన్సూరెన్స్ చేయకపోతే దానిని డి ఐ ఆక్టివేట్ చేయాలని చెబుతారని అప్పుడు ఇన్సూరెన్స్ ని డి ఐ ఆక్టివేట్ చేయటానికి సైబర్ నేరగాళ్ళు మీకు ఒక ఏపీకే ఫైల్‌ని పంపిస్తారు. మీరు సైబర్ నేరగాళ్ల మాటలను నమ్మి మీరు ఏపీకె ఫైల్ ఓపెన్ చేయమని చెప్పి మీ యొక్క క్రెడిట్ కార్డ్ వివరాలు, క్రెడిట్ కార్డుపై ఉన్న 16 అంకెలను, సీవీవీ, ఎక్సపీరి డేట్ వివరాలు తెలియజేస్తే తద్వారా సైబర్ నేరగాళ్ళకి తెలవగానే మీ సొమ్ము కొల్లగొడతారని అన్నారు. ఇలాంటి మోసాలు జరుగుతున్నట్లు దృష్టికి చాలా వచ్చాయని కాబట్టి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండి మీ యొక్క కార్డు వివరాలను ఎవ్వరికీ తెలియజేయవద్దన్నారు. ఏ బ్యాంక్ అధికారి కూడా మీ యొక్క కార్డు వివరాలను అడగరని మీకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని తెలిపారు.

రైతుల భూములకు సరైన పరిహారం చెల్లిస్తాం : జేసీ

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : కేంద్ర ప్రభుత్వము ఏర్పాటు చేస్తున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రాజెక్టు 765 కేవి కర్నూలు -3 పవర్ లైన్ ల నిమిత్తం రైతుల నుండి సేకరించు భూములకు సరైన విలువ కట్టి పరిహారం చెల్లిస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య తెలిపారు.మంగళవారం ఉదయం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో ఓర్వకల్లు మండలము నకు చెందిన రైతులతో సంయుక్త కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య సమావేశం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ టవర్‌లు, పవర్ లైన్‌లు ఏర్పాట్లు చేయటానికి మరియు కార్పొరేషన్ అవసరాల నిమిత్తం రైతుల భూములు సేకరించ వలసి వస్తున్నదని అందుకుగాను రైతులు సహృదయంతో సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు అధిక మొత్తంలో పరిహారం చెల్లించాలని జాయింట్ కలెక్టర్ ను కోరారు.. ఒక టవర్ ఏర్పాటు నిమిత్తం దాదాపు ఏడు సెంట్లు, ఇతర అవసరాల నిమిత్తం దాదాపు అర్థ ఎకరా సేకరించడం జరుగుతుందని, వీటికి తగిన పరిహారం ఇచ్చే విధంగా, అందరికి మంచి చేసే చర్యలు తీసుకుంటామని రైతులకు జేసీ తెలియజేశారు. ఈ సమావేశానికి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్‌కే చౌహన్, డీజీఎం జి.నాగరాజు, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి మరియు రెవెన్యూ ల్యాండ్ అక్విషన్ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ డొనేషన్స్ పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం..

- కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని తల్లి తండ్రులు డిమాండ్
- పేరుకే కార్పొరేట్..అక్కడంత లోపబాయిష్టం
- తనిఖీలు మరిచిన విద్యాశాఖ అధికారులు
- ఆలూరులో కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు ఇష్టరాజ్యం

విశాలాంధ్ర-ఆలూరు : రాష్ట్రంలోని ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాల్లో గత ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం విద్యను ను ప్రవేశపెట్టింది. కానీ గత ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లీష్ మీడియం ఎలా ఉన్న. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంలో కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్లో ఆయా యాజమాన్యాలు అడిదే అట. పాడిందే పాటగా మారింది. ఆయా ప్రయివేట్ పాఠశాల్లో అధిక ఫీజుల దోపిడితో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని తల్లి తండ్రులు వాపోతున్నారు. ఈ తాతంగం వెనుకబడిన నియోజకవర్గంలోని ఆలూరు మండలం లో పలు కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో జరుగుతుండటం కోసమేరుపు. ఇటు విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం ఆలూరు నియోజకవర్గ కేంద్రం కలకాలం రేగుతోంది వివరాల్లోకి వెళితే.. ఆలూరు మండల కేంద్రములో దాదాపుగా 6 దాకా ప్రయివేట్ ఒక కార్పొరేట్ పాఠశాలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థల్లో చాలా వరకు నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఆల్ ఫోర్స్ స్మార్ట్ స్కూల్ అనే పేరుతో పాఠశాల ఏర్పాటు చేసి అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్నాయి. ఇదే పాఠశాల్లో తమ విద్య సంస్థ పేరుతొ మెటీరియల్‌ని అమ్ముతూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను అధిక ధరలకు అమ్ముతు నిలువు దోపిడీ చేస్తున్నారని వారి తల్లితండ్రులు వాపోతున్నారు. అంతేకాకుండా మండల కేంద్రం లో ఉన్న ఒక కార్పొరేట్ స్కూల్, ఫౌండేషన్ స్కూల్ అని చెప్తూ వేళలో ఫీజులు మాలు చేస్తూ ధనర్జనే ధ్యేయంగా దోచుకుంటున్నారు. విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని మండి పడ్డారు. విద్యా శాఖ అధికారుల అలసత్వం వల్ల యాజ మాన్యాలు ఇష్టమెచ్చినట్లు ఫీజులు పెంచు కుంటూ పోతున్నారు. పెరిగే ఫీజులతో పేద విద్యార్థులకు చదువులు అందని ద్రాక్షలా మారింది. ఫీజుల నియంత్రణ పై అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో యాజమాన్యాలు, ఫీజులు తమ ఇష్టారాజ్యాంగ పెంచుకున్నారు. రకరకాల పేర్లతో పుట్టుకొస్తున్న పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్స్ మొదలు స్కూల్లో విద్యార్థులకు అవసరమైన గుర్తింపు కోసం పాకులాడే యాజమాన్యం ఇచ్చే టైలు, బెల్టు, షూసు, బుక్స్ వరకు యాజ మాన్యాలు నిర్ణయించిన అధిక ధరలకె. కొనుగోలు చేయాల్సి ఉందని విద్యార్థుల తల్లి తండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా కార్పొరేట్ స్కులు, ప్రయివేట్ పాఠశాల్లో జరుగుతున్నా అధిక ఫీజుల దోపిడీపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎంఈవో వివరణ :

అలాంటి స్కూలు మా దృష్టికి వస్తే కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అక్రమ డొనేషన్లు అధిక ఫీజులు ఇలాంటివి ఏ పాఠశాల్లో జరిగిన విద్యార్థులు, వారి తల్లి తండ్రులు తమ దృష్టికి తీసుకువస్తే అలాంటి స్కూళ్లపై చర్యలు తీసుకోవడం కాకుండానే సంభందించిన అధికారుల నిర్ణయం మేరకు పాఠశాలల గుర్తింపును రద్దు చేసేందుకు వెనుకాడం.

మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర – పత్తికొండ: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆసువత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే పూర్తిస్థాయిలో వైద్యులను, టెక్నీషియన్స్‌ను నియమించాల్సి ఉందని, తమ ప్రభుత్వ హయాంలో త్వరలోనే పత్తికొండ ఆసుపత్రిని ఏవన్ ఆసువత్రిగా తీర్చిదిద్ది రోగులకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గర్భిణీ మహిళలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కల్పన, టీడీపీ నాయకులు బత్తిన వెంకటరాముడు, తుగ్గలి నాగేంద్ర, ముత్యాల తిరుపాల్, ఆలం కొండ నబి, బత్తిన లోకనాథ్, మనోహర్ చౌదరి, కడవల సుధాకర్, వెంకటపతి, మిద్దె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు వార్డుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర – కర్నూలు సిటీ: కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని కల్లూరు వార్డుల సమస్యలను పరిష్కరించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. మంగళవారం ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగర పాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో కమిషనర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి నగరపాలక అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. వీధి దీపాల మరమ్మతులు, పూడికతీత పనులు, పూర్తిగా అధ్వానమైన రోడ్లలో వెంటనే మెట్రల్ రోడ్డు, పందులు, కుక్కల బెడద తగ్గింపుకు చర్యలు, తాగునీటి సరఫరా సమయం పెంపు వంటి పలు అంశాలపై ఎమ్మెల్యే, అధికారులతో చర్చించారు. సమావేశంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎస్‌ఈ వేణుగోపాల్, ఎంఈలు షాకీర్, శేషసాయి, ఆరోగ్య అధికారి విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, ఆర్‌ఓ జునైద్, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవ సిలీంద్ర నాసినీతో విశిష్ట ఉపయోగాలు

విశాలాంధ్ర – పాణ్యం : మండల పరిధిలోని బలపనూరు గ్రామం నందు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాల, వ్యవసాయ శాఖ పాణ్యం మండలం ఆధ్వర్యంలో జరిగిన రైతుల సమావేశం నందు ట్రైకొడర్మావిరిడి పశువుల ఎరువు తో అధిక నిష్పత్తి లో ఎలా తయారు చేసుకోవాలన్న దానిపై వివరించారు. మినుములు, వరి, మిరప పైరులను ఆశించు క్రిమి కీటకాలను తెగులను అరికట్టు విధానాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ సరళమ్మ నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, సీనియర్ సైంటిస్టులు డాక్టర్ బాలాజీ నాయక్,డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సతీష్ బాబు, మండల వ్యవసాయ అధికారి జయప్రకాశ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ ఉద్యాన సహాయకులు, బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు, వీఏఏలు, గ్రామ పెద్దలు ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర – ఆదోని రూరల్: ఎన్నికల ముందు విడుదల చేసిన సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని ఎన్డీఏ కూటమి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ దొక డిమాండ్ చేశారు. మంగళవారం సప్తగిరి సిమెంట్ గోడౌన్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని విత్తనాలకు, ఎరువులకు వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు ఎంతో ఆసక్తితో రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం అవడంతో విద్యార్థులకు ఫీజులు బుక్స్ ట్రాన్స్పోర్ట్ ఖర్చులు భరించలేక తల్లిదండ్రులు తల్లులు పట్టుకుంటున్న అమ్మ ఒడి సంక్షేమ పథకాన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనిఆగ్రహం వ్యక్తం చేశారు. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు ప్రతినెల రూ. 1500తో పాటు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన భూపాల్ రెడ్డి

విశాలాంధ్ర – బనగానపల్లె: రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని రాయలసీమ రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఎం.భూపాల్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి బీసీ జనార్థనరెడ్డి స్వగృహంలో ఆయన పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు.

ద్వి చక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్‌కు సంబంధించిన చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహరు మాట్లాడుతూ హైకోర్టు తీర్పు ప్రకారం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. హెల్మెట్ వాడకంను టూ వీలర్ నడిపే వారికీ అవగాహన కల్పించాలని ప్యానెల్ లాయర్లుకు, పారా లీగల్ వాలంటీర్లకు, కోర్టు సిబ్బందికి షార్ట్ ఫిల్మ్ వేసి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు రోడ్డు ప్రమాదాల బారినపడకుండా ఖచ్చితంగా శిరస్త్రాణం ధరించాలన్నారు. వాహనదారునితో పాటు వారితో ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతిఒక్కరు రహదారి నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎస్.మనోహర, జి.పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ ప్రిన్సిపల్ వై.మురళిధర రెడ్డి, జిల్లా రవాణా కమిషనర్ శ్రీధర్, ట్రాఫిక్ సిఐ గౌతమి, ఆర్‌టిఓ రమేశ్, తాలూకా సిఐ ఎం.శ్రీధర్, కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన లాల్ స్వామి పీర్లు

విశాలాంధ్ర – చాగలమర్రి : మండల కేంద్రమైన చాగలమర్రిలో మొహరం పర్వదినాన్ని పురస్కరించుకొని లాల్ స్వామి ప్రధాన పీరుతో పాటు చిన్న పీర్లు మంగళవారం కొలువుదిరాయి. స్థానిక చిన్న మకానంలోని లాల్ స్వామి కాలనీ నుండి స్వామి పెట్టెలు కమిటీ నిర్వాహకుడు ముల్లా రఫీ ఆధ్వర్యంలో మేళ తాళాలతో పెద్ద సంఖ్యలో భక్తులు వెంటరాగా లాలు స్వామి మఖనం వరకు ఊరేగింపుగా తీసుకొని వచ్చారు ఈ సందర్భంగా స్వామి పెట్టెలకు భక్తులు ప్రత్యేక ఫాతే:హాలు చేశారు గతంలో ఎన్నడు లేని విధంగా భక్తులు ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొనడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ముల్లా రఫీ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన ప్రధాన పీరు లాల్ స్వామి రాత్రి సరగత్తు, 17వ తేదీన పగటి సరగత్తు ఊరేగింపు ఉత్సవాలు ఉంటాయని తెలిపారు ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారన్నారు. ఉత్సవాలు కులమతాలకు అతీతంగాజరుగుతాయని భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర – ఆస్పరి: మండలంలో ఉపాధి హామీ కూలీలకు ఆరు వారాలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి విరూపాక్షి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణకు సీపీఐ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.300 ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా ఎక్కడా అది అమలు కావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.300 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600కు పెంచాలని, ఉపాధి హామీ పనులు గ్రామాల్లో నిర్వహించాలన్నారు. మండల పరిధిలో కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిర్వహించక పోవడం వల్ల కూలీలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు హనుమంతు, నాగరాజు, సీనియర్ నాయకులు హనుమంతు, వీరన్న, వీరాంజనేయులు, వీరేష్, ఈరన్న, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన వీఆర్వోకు సన్మానం

విశాలాంధ్ర – కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామపంచాయతీలో విఆర్‌ఓగా విధులు నిర్వహిస్తు జూన్ 30వ తేదీ పదవి విరమణ పొందిన విఆర్‌ఓ ప్రసాదయ్యకు మంగళవారం తహసీల్దార్ అనురాధ, డిప్యూటీ తహసీల్దారు విష్ణు ప్రసాద్ సీనియర్ అసిస్టెంట్ మనోహర్, జూనియర్ అసిస్టెంట్, ఎస్‌ఓ, ఈఆర్వో సిబ్బంది, వీఆర్ఏలు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రసాదయ్య విఆర్‌ఓగా చేస్తున్న సమయంలో ఎప్పుడు కూడా ఉద్యోగ బాధ్యత మరవకుండా ప్రజలకు దగ్గరగా ఉండి బాధ్యతలు నిర్వర్తించాడని వారు కొనియాడారు. రెవెన్యూ వ్యవస్థలో తనకున్న జ్ఞానంతో రెవిన్యూ చట్టాలపై అవగాహన కలిగిన వ్యక్తి అన్నారు. ఉన్నతాధికారులు పని అప్పగించినప్పుడు పనిచేయడంలో నిర్లక్ష్యం లేకుండా వెంటనే పనిచేసేవాడని వారన్నారు. తన జీవితకాలంలో ఎక్కడ ఉద్యోగ బాధ్యతలు మరువలేదని వారు తెలిపారు. అనంతరం సన్మాన కర్త మాట్లాడుతూ 1992లో వీఆర్వోగా విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు ఉద్యోగ బాధ్యతలు మరువలేదన్నారు. ఎక్కువ కాలం పాటు కంబాలపాడు గ్రామ పంచాయతీకి ఎక్కువ సేవ చేశానని, కేఈ కుటుంబం చొరవతో కంబాలపాడులో పని చేశానని ఆయన తెలిపారు. తాను విధుల్లో ఉన్నప్పుడు రైతులు ప్రజలు తనకెంతో సహకరించారని, వారికి ఎప్పుడు నేను రుణపడి ఉంటానన్నారు.

ఇద్దరు వలస కూలీలు మృతి..

విశాలాంధ్ర– కోసిగి: గ్రామానికి చెందిన వలస కూలీలు పొట్టకూటి కోసం కుటుంబ సభ్యులతో కలిసి చిత్తూరు దగ్గర ఉండే పీలేరు సమీపంలోవలస వెళ్లిన కూలీలు ఆటో టిప్పర్ ఢీకొని మృతి చెందారు. బంధువులు, స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కోసిగి గ్రామానికి చెందిన నాగన్న గేరి కాలనీ వాసులైన కౌతాళం హుసేని, శ్రీదేవి, దంపతుల కుమార్తె మహాలక్ష్మి (17), ఎన్టీఆర్ కాలనీ చెందిన బుల్లి. అంజనమ్మ (35) వలస కూలీలు పీలేరు కు వలస వెళ్లారు.సోమవారం పని ముగించుకొని సాయంత్రం 5:30 తిరుగు ఇంటికి ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో ఆటోను టిప్పర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే ఇద్దరు కూలీలు మృతి చెందారు. వీరితోపాటు మరి కొంతమంది కూలీలకు గాయాలయ్యాయి.గత కొన్ని సంవత్సరాలుగా కుటుంబ సభ్యులతో కలిసి వలస వెళ్లేవారనీ గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో ఉపాధి పనులు లేకపోవడంతో చేసేది ఏమీ లేక కుటుంబ భారం కావడంతో పొట్ట కూటి కోసం మండలం నుండి వేలాది మంది వలస వెళుతుంటారు. పొట్ట కూట్టి కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్థానికంగా ఉపాధి కల్పించే విధంగా ఏదైనా చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కొంతవరకు వలసలను ఆపవచ్చని గ్రామస్తులు అభిప్రాయం. మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

జంగమ అర్చక సమైక్య బైలా రిజిస్ట్రేషన్

విశాలాంధ్ర – ఆదోని రూరల్: డివిజన్ జంగమ అర్చక సమాఖ్య సంఘము బైలా రిజిస్ట్రేషన్ పత్రాన్ని కల్లుమటం పిటాదిపతి చేతుల మీదుగా జంగమ సమాఖ్య సంఘము నాయకులు చెన్న బసయ్య, చంద్రశేఖరయ్య స్వామి, టీచర్ అల్వారు మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంగమ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశలో పోరాటాలు చేస్తామన్నారు. జంగమ సమాఖ్య సంఘము ఆధ్వర్యంలో అనేక సేవ కార్యక్రమాలు పాలుపంచుకోవడం జరుగుతుందన్నారు. పేద జంగమ కుటుంబాలు ఆర్థికంగా, విద్యపరంగా, రాజకీయంగా అంచలంచెలుగా ఎదిగేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు, సమాజపు కార్యదర్శి మదిరే విరేష్, జగదీశ్వరయ్య స్వామి, విరుపక్షయ్య స్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కంది పప్పు, బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేయండి : జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర – నంద్యాల : నిత్యావసర సరుకులైన కంది పప్పు, బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయాలు జరపాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక రైస్ మిల్లర్లు, దాల్మిల్లర్లతో ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిత్యావసర సరుకులు ధరల పెరుగుదల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడకుండా సరసమైన ధరలకే రైతు బజార్లలో కంది పప్పు, బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేసి విక్రయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బియ్యం, కందిపప్పు ధరలు మార్కెట్ రేటు కన్నా తక్కువ ధరలకు అమ్మాలని మిల్లర్లను సూచించారు. సూపర్ మార్కెట్ల నందు మరియు రైతు బజార్లలో స్పెషల్ కౌంటర్లు ప్రారంభించాలని ఆయన తెలిపారు. ప్రతి ఒక్క కౌంటర్ ముందు తప్పనిసరిగా ధరలతో కూడిన బ్యానర్ ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. జిల్లాలో మొత్తం ఐదు కౌంటర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను సూచించారు. పట్టణంలోని శ్రీనివాస నగర్ రైతు బజార్ నందు, టెక్కె మార్కెట్ యార్డ్, ఆళ్లగడ్డ ఆత్మకూర్, డోన్ మండలం నందు గల మార్కెట్ యార్డులలో కౌంటర్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లైస్ అధికారులను ఆదేశించారు. కౌంటర్లలో వస్తువుల నాణ్యత తగ్గకుండా చూడాలని, నిత్యవసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ధరలను కంట్రోల్ చేసే ప్రయత్నంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతుందని ఆయన వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం జిల్లాలోని రైతు బజార్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ల నందు, సూపర్ మార్కెట్ల నందు కందిపప్పు-రూ. 160, సోనా మసూరి ఫైన్ రైస్-రూ. 49గా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రత్యేక కౌంటర్లు గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభించబడుతుందన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు వినియోగదారులకు అందుబాటులో ఉంతాయని ఆయన తెలిపారు. జిల్లాలోని వినియోగ దారులు తమ ఆధార్ కార్డుతో పాటు క్యారీ బ్యాగులు తీసుకొని కొనుగోలు చేసుకోవలసిందిగా సూచించారు. ధరల నియంత్రణకు ప్రతివారం మిల్లర్లు హోల్ సేల్ డీలర్లతో సమావేశం నిర్వహిస్తానని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్లు, దాల్ మిల్లర్లు, సివిల్ సప్లై అధికారి వెంకట్రాముడు, ఏఎస్‌ఓ రవిబాబు, ఎస్టేట్ అధికారి సురేష్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ పెండింగ్ సమస్యలపై సమగ్ర నివేదిక ఇవ్వండి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : ఏపీఐఐసీకి సంబంధించిన పెండింగ్ సమస్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ కార్యక్రమాల గురించి జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరించారు. కర్నూలు జిల్లాలో ఏపీఐఐసీకి సంబంధించి 9074.52 ఎకరాల ల్యాండ్ బ్యాంక్ ఉందని, ఓర్వకల్లు ప్రాంతంలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు, గుట్టపాడు క్లస్టర్, ఎం ఎస్ ఎం ఈ ల గురించి వివరించారు. ల్యాండ్ బ్యాంక్‌కు సంబంధించి ఏ ప్రాంతంలో ఎంత ల్యాండ్ ఉంది అని కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు నీటి సరఫరా కోసం ముచ్చుమర్రి నుండి మంజూరైన పైప్ లైన్ పనుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపిఐఐసి భూములకు సంబంధించి మార్ట్ గేజ్ చేసే ప్రక్రియ పై రాష్ట్ర స్థాయి నుండి ఉత్తర్వులు రూపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపీఐఐసీ జడ్ఎంను ఆదేశించారు. ఆ మేరకు ఉన్నతాధికారులకు లేఖ రాయాలని సూచించారు.. మ్యూటేషన్‌లు ఎవరి పేరుతో ఉండాలో కూడా ఏపీఐఐసీనే నిర్ణయించాలని కలెక్టర్ తెలిపారు. ఏపీఐఐసీకి సంబంధించి ప్రభుత్వం నుండి పెండింగ్‌లో ఉన్న సమస్యలపై తనకు సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరలో తాను ఏపీఐఐసీ పరిశ్రమలు, భూములను విజిట్ చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పరిశ్రమల శాఖ కార్యక్రమాల గురించి ఆ శాఖ జనరల్ మేనేజర్ మారుతి ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 158 దరఖాస్తులు వచ్చాయని, అందులో 149 దరఖాస్తులు అప్రూవ్ చేయడం జరిగిందని, 4 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, 5 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాలను గురించి వివరించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించి, అర్హులైన వారికి అనుమతులు ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన దరఖాస్తులను పథకం గైడ్ లైన్స్‌తో పాటు సంబంధిత ఎంపిడిఓలకు పంపించి, సచివాలయ సిబ్బంది ద్వారా వెరిఫై చేయించాలని కలెక్టర్ జీఎంను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డిఆర్‌ఓ మధుసూదన్ రావు, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, ఏపీఐఐసి జెడ్ఎం సోమశేఖర్ రెడ్డి, పరిశ్రమల శాఖ జిఎం ప్రసాద్, ఓర్వకల్లు తహశీల్దార్ నట్రాజ్ తదితరులు పాల్గొన్నారు.